జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## భద్రాద్రి కొత్తగూడెం

శనివారం | 23 | మే | 2026 | పేజీలు : 8



## భద్రాద్రి రామయ్యకు వైభవంగా పట్టాభిషేకం

- స్వామి వారిని దర్శించుకున్న సినీ దర్శకులు మారుతి, నటుడు సప్తగిరి



**భద్రాచలం టౌన్ , మే 22 , ప్రజా జ్యోతి** భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి వారికి శుక్రవారం పుష్యమి నక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామి వారికి పట్టాభిషేకం నిర్వహించారు. తొలుత స్వామి వారిని అందంగా అలంకరించి నిత్యకల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చి, తొలుత నిత్యకల్యాణం నిర్వహించారు. విశ్వక్సేనార్చన, పుణ్యహావచనం, కంకణ దారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు. అనంతరం పట్టాభిషేకంను మిగతా 2 లో...

- 2028 ఎన్నికలకు గురిపెట్టి బిఆర్ఎస్ వ్యూహం..!
- రావులపల్లికే పార్టీ పగ్గాలు
- కామ్రేడ్ క్యాడర్‌పై గులాబీ గాలం
- కాంగ్రెస్ కోటలో చిచ్చుపెట్టే వ్యూహమా..?
- భద్రాచలం రాజకీయాల్లో మళ్లీ వేడెక్కిన సమీకరణాలు

3 లో..



# స్పీడ్ పెంచిన కారు...



ఒకప్పుడు "ఎర్రజెండా ఎగిరే నేల"గా పేరొందిన భద్రాచలం రాజకీయాలు ఇప్పుడు కొత్త మలుపు తిరుగుతున్నాయి. వామపక్షాల కంచుకోటగా నిలిచిన ఈ నియోజకవర్గంలో కాలక్రమేణా ప్రాంతీయ రాజకీయాల ప్రభావం పెరిగింది. తెలంగాణ ఉద్యమం తర్వాత రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోగా... ఇప్పుడు మరోసారి భద్రాచలంపై బిఆర్ఎస్ ప్రత్యేక దృష్టి సారించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.

భద్రాచలం, ప్రజాజ్యోతి



## భద్రాద్రిని ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దుదాం...

### జిల్లా కలెక్టర్ అంకిత్

- శాఖల సమన్వయంతో జిల్లాను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దాలని పిలుపు
- క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు పరిష్కరించాలన్న ఎమ్మెల్యేలు
- కొత్తగూడెం క్లబ్‌లో ఘనంగా ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమావేశం

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 22 (ప్రజాజ్యోతి)** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశం ఘనంగా జరిగింది. కొత్తగూడెం క్లబ్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షత వహించగా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఇల్లందు ఎమ్మెల్యే మిగతా 2 లో...

## భారీగా పట్టుబడిన గంజాయి

- రూ.1.50 కోట్ల విలువైన 300 కేజీల గంజాయి స్వాధీనం
- రెండేళ్లలో జిల్లాలో రూ.77 కోట్ల విలువైన 15,293 కేజీల గంజాయి పట్టివేత.. రోహిత్ రాజ్....భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ



**అశ్వారావుపేట, మే 22 (ప్రజా జ్యోతి) :** తెలంగాణ రాష్ట్ర సరిహద్దు చెక్పోస్ట్ వద్ద విశ్వాసనీయ సమాచారం మేరకు నిర్వహించిన తనిఖీల్లో పోలీసులు భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రూ.1.50 కోట్ల విలువ కలిగిన సుమారు 300 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ అధికారికంగా వెల్లడించారు. శుక్రవారం అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ లో నిర్వహించిన పాత్రికేయులు సమావేశంలో ఈ ఘటనకు సంబంధించి వివరాలు జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ వెల్లడిస్తూ వాహన తనిఖీలలో భాగంగా పోలీసులు ఆర్ జె 06,సిడి 9546 నెంబర్ గల మిగతా 2 లో...


## అటవీ ప్రాంతంలో చిరుత సంచారం కలకలం

- గాలింపు చేపట్టిన చర్ల, వెంకటాపురం అటవీశాఖ అధికారులు
- చిరుతకు హాని చేయొద్దు-అటవీశాఖ అధికారులు



**చర్ల, మే 22:(ప్రజాజ్యోతి):** చర్ల, వెంకటాపురం పరిధిలోని ఏదిర గుట్టలు ,యాకన్నగూడెం , సుబ్బంపేట అటవీ ప్రాంతంలో చిరుత పులి సంచారం కలకలం రేపింది. శుక్రవారం రాత్రి సుబ్బంపేట అడవికి సమీప ప్రాంతాల్లో చిరుత తిరుగాడినట్లు స్థానికులు గుర్తించడంతో గ్రామాల్లో భయాందోళన నెలకొంది. చిరుతపులి కదలికలు గమనించిన గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న చర్ల, వెంకటాపురం అటవీశాఖ అధికారులు శుక్రవారం ఉదయం నుంచే అప్రమత్తమై అటవీ ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. అధికారులు సిబ్బందితో కలిసి అడవిలో పలు ప్రాంతాలను పరిశీలించి చిరుత అడుగుజాడలను గుర్తించారు. చిరుత ఏ దిశగా వెళ్లిందనే విషయంపై అధికారులు ఆరా తీస్తూ అటవీ ప్రాంతాలను మిగతా 3 లో...

## భద్రాద్రి రామయ్యకు వైభవంగా పట్టాభిషేకం



(మొదటి పేజీ తరువాయి...)

వైదిక సిబ్బంది నిర్వహించారు. ఈ సమయంలో స్వామి వారికి పలు ఆయుధాలను సమర్పించారు. అలాగే స్వామి వారిని ప్రముఖ సినీ దర్శకులు మారుతి దంపతులు, హాస్య నటుడు, సప్తగిరి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే నిత్యకల్యాణంలో పాల్గొ న్నారు. అనంతరం డైరెక్టర్ మారుతి, నటుడు సప్తగిరి విలేకరులతో మాట్లాడుతూ పుష్యమి నక్షత్రం రోజున భద్రాద్రి రామయ్యను దర్శించుకోవడం పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొనడం తమ పూర్వజన్మ సుప్రతమని వారు పేర్కొన్నారు.

## భారీగా పట్టుబడిన గంజాయి




(మొదటి పేజీ తరువాయి...)

మారుతి బలేనో కారు, ఆర్ జె 51, జిఏ 0464 నెంబర్ గల టాటా లారీని జీలుగుమిల్లి వైపు నుండి అశ్వారావుపేట వైపుకు వస్తున్న సమయంలో ఆపి తనిఖీలు నిర్వహించి వాహనాలు పరిశీలించగా బలెనో కారు డిక్కీలో ఒక్కొక్కటి 10 కిలోల బరువైన 5 గంజాయి ప్యాకెట్లు టాటా లారీలో క్యాబిన్ వెనుక భాగంలో ప్రత్యేకంగా తయారుచేసిన అరలో ఒక్కొక్కటి 10 కిలోల బరువు ఉన్న 25 గంజాయి ప్యాకెట్లు దాచినట్లు గుర్తించారు. మొత్తం 30 ప్యాకెట్లలో 300 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించిన పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాజస్థాన్ కు చెందిన కారు డ్రైవర్ రాజేష్ పూరి, లారీ డ్రైవర్ షహజద్ ఖాన్, ట్రాన్స్పోర్టర్లు కమలేష్ శర్మ,,రమేష్ చంద్రబలై లను అదుపులోకి తీసుకొని వారిని విచారించగా ఆంధ్ర, ఒరిస్సా సరిహద్దు ప్రాంతంలోని ముంచింగిపట్టు గ్రామ అటవీ ప్రాంతంలో వంతల కృష్ణ, విక్కి అనే వ్యక్తుల వద్ద నుండి గంజాయిని కొనుగోలు చేసినట్లు అంగీకరించారు. కొనుగోలు చేసిన గంజాయిని రాజస్థాన్ రాష్ట్రానికి తరలించి గోపాల్ భీల్ అనే వ్యక్తికి విక్రయించాలన్న ఉద్దేశంతో రవాణా చేస్తున్నట్లు తెలిపారు. ఆర్ జె51, జిఏ 0464 అనే టాటా లారీ, ఆర్ జె 06, సిడి 9546 అనే మారుతి బలేనో కారు, నేరానికి ఉపయోగించిన నాలుగు మొబైల్ ఫోన్ లు,300 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, 7గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి, నలుగురు వ్యక్తుల్ని అదుపులోకి తీసుకున్నామని పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక గాలింపు చర్యలు చేపడతామన్నారు. ఎన్ డిపిఎస్ చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తామన్నారు.అదుపులోకి తీసుకున్న వారిని కోర్టులో హాజరు పరచనున్నట్లు పేర్కొన్నారు. గంజాయి రవాణా, అక్రమ వ్యాపారాలపై పోలీసుల శాఖ నుండి కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని, రాష్ట్ర సరిహద్దులు దాటే మార్గాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, చెక్‌పోస్టుల వద్ద విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లాలో గత రెండు సంవత్సరాల కాలంలో పోలీసులు నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్లలో రూ.77కోట్ల విలువైన 15,293 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని 670 మందిని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. గంజాయి అక్రమ రవాణాలో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. ప్రజల సహకారంతో మత్తు పదార్థాల నియంత్రణకు మరింత సమర్థవంతమైన చర్యలు కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సతీష్ కుమార్, సిఐ నాగరాజు, ఎస్ఐలు యాయాతి రాజు, రాజేష్‌కుమార్, టాస్క్ ఫోర్స్ ఎస్ ఐలు ప్రవీణ్, సుమన్ రామారావు, రాజమౌళి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రిని ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దుదాం : జిల్లా కలెక్టర్ అంకిత్









(మొదటి పేజీ తరువాయి...)

కోరం కనకయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు ముందుగా వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన, అభివృద్ధి, సంక్షేమ ప్రదర్శన స్టాల్స్‌ను సందర్శించారు. ఆయా శాఖలు అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలు, ప్రజలకు అందిస్తున్న సేవలు, క్షేత్ర స్థాయిలో చేపడుతున్న కార్యక్రమాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సమావేశంలో జిల్లా స్థాయి అధికారులు తమ శాఖల ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రగతి నివేదికలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గ్రామాలు, మండలాలు, పట్టణాల్లో చేపట్టిన పారిశుద్ధ్య కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాలు, ప్రత్యేక డ్రైవ్‌లు, అవగాహన సదస్సులు, ప్రజా సమస్యల పరిష్కార చర్యలపై సమగ్రంగా వివరించారు.

### ♦ సమిష్టి కృషితో జిల్లాను ఆదర్శంగా తీర్చిదిద్దాలి: జిల్లా కలెక్టర్ అంకిత్

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు పారదర్శక పాలన అందించాలనే లక్ష్యంతో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. కార్యక్రమం ప్రారంభ దశలోనే జిల్లాలోని సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. గ్రామాలు, వార్డుల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు, సంక్షేమ వారోత్సవాలు, ఆరోగ్య శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామపంచాయతీలు, మండలాలు, మున్సిపాలిటీల స్థాయిలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేస్తున్నాయని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సమిష్టిగా పని చేస్తే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను రాష్ట్రంలోనే రోల్ మోడల్ జిల్లాగా తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు. ప్రతి శాఖ బాధ్యతాయుతంగా పనిచేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేయాలని సూచించారు. ప్రజలకు అందుతున్న సేవలపై నిరంతర పర్యవేక్షణ అవసరమని తెలిపారు.

### ♦ ప్రజలకు ప్రభుత్వాన్ని మరింత చేరువ చేసే కార్యక్రమం : ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రజలకు ప్రభుత్వాన్ని మరింత చేరువ చేసే గొప్ప కార్యక్రమమన్నారు. ఏ ప్రభుత్వం అయినా తమ విధానాలు, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరాలంటే ఇలాంటి కార్యక్రమాలు అవసరమని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు అంకితభావంతో పని చేస్తే గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ప్రతి శాఖ తమ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తే ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని చెప్పారు. గ్రామస్థాయిలో ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమం ద్వారా వివిధ శాఖల పనితీరు, ప్రజలకు అందిస్తున్న సేవలపై స్పష్టమైన అవగాహన ఏర్పడిందని పేర్కొన్నారు. జూన్ 12న నిర్వహించనున్న ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక ముగింపు ఉత్సవాలను జిల్లావ్యాప్తంగా పండుగ వాతావరణంలో నిర్వహించాలని సూచించారు.

### ♦ అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు చేరాలి : ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మహాలక్ష్మి పథకం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు వంటి పథకాలను ప్రజలకు సమర్థవంతంగా అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడమే ప్రధాన లక్ష్యమన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా నిరంతర పర్యవేక్షణతో పని చేయాలని సూచించారు. రాష్ట్రంలోనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను ఆదర్శ జిల్లాగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

### ♦ ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో మరింత అవగాహన అవసరం: ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. అయితే ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పథకాలు ప్రజలకు మరింత చేరువ అవుతున్నాయని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయని విధంగా తెలంగాణ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పలు పథకాలు అమలు చేస్తోందన్నారు. ఈ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా పని చేయాలని సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.


### ♦ శాఖల సమన్వయంతోనే అభివృద్ధి: మేయర్ మూడ్ గణేష్

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ మాట్లాడుతూ ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా చేపట్టిన కార్యక్రమాలు గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి ఎంతో దోహదపడుతున్నాయని అన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 65 డివిజన్లలో పారిశుద్ధ్య కార్యక్రమాలతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. గిరిజన జిల్లా అభివృద్ధిలో అన్ని శాఖల భాగస్వామ్యం అవసరమని, శాఖల సమన్వయంతోనే ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందన్నారు. అనంతరం సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, కొత్తగూడెం ఆర్డీవో మధు, భద్రాచలం ఐటిడిఏ పీఓ రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, వార్డు సభ్యులు, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

- 2028 ఎన్నికలకు గురిపెట్టి బిఆర్ఎస్ వ్యూహం..!
- రావులపల్లికే పార్టీ పగ్గాలు
- కామ్రేడ్ క్యాడర్‌పై గులాబీ గాలం
- కాంగ్రెస్ కోటలో చిచ్చుపెట్టే వ్యూహమా..?
- భద్రాచలం రాజకీయాల్లో మళ్లీ వేడెక్కిన సమీకరణాలు



# స్పీడ్ పెంచిన కారు...



**ఒకప్పుడు "ఎర్రజెండా ఎగిరే నేల"గా పేరొందిన భద్రాచలం రాజకీయాలు ఇప్పుడు కొత్త మలుపు తిరుగుతున్నాయి. వామపక్షాల కంచుకోటగా నిలిచిన ఈ నియోజకవర్గంలో కాలక్రమేణా ప్రాంతీయ రాజకీయాల ప్రభావం పెరిగింది. తెలంగాణ ఉద్యమం తర్వాత రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోగా... ఇప్పుడు మరోసారి భద్రాచలంపై బిఆర్ఎస్ ప్రత్యేక దృష్టి సారించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.**

● భద్రాచలం, ప్రజాజ్యోతి

ఈ క్రమంలోనే సీనియర్ నాయకుడు రావులపల్లి రాంప్రసాద్‌ను భద్రాచలం నియోజకవర్గ ఇంచార్జిగా నియమిస్తూ బిఆర్ఎస్ అధిష్టానం తీసుకున్న నిర్ణయం సాధారణ రాజకీయ పరిణామంగా కాకుండా... భవిష్యత్ ఎన్నికల వ్యూహంగా విశ్లేషిస్తున్నారు.

### ››› కామ్రేడ్ల కోట... ప్రాంతీయ పార్టీల వేట

భద్రాచలం నియోజకవర్గ రాజకీయాలపై దశాబ్దాల పాటు వామపక్షాల ప్రభావం కొనసాగింది. ముఖ్యంగా సీపీఐ గ్రామస్థాయి నుంచి గిరిజన బెల్ట్ వరకు బలమైన పట్టు సాధించింది. భూ పోరాటాలు, గిరిజన ఉద్యమాలు, పోడు భూముల సమస్యలతో కామ్రేడ్లు ప్రజల్లో బలమైన మద్దతు సంపాదించారు. అయితే తెలంగాణ ఉద్యమం తర్వాత రాజకీయ సమీకరణాలు మారాయి. ప్రాంతీయ భావజాలం బలపడటంతో టీఆర్ఎస్ ప్రభావం పెరిగింది. అయినప్పటికీ 2014 ఎన్నికల్లో టీఆర్ఎస్ ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధించలేకపోయింది. ఆ ఎన్నికల్లో కామ్రేడ్లు మళ్లీ తమ ప్రభావాన్ని చాటుకోగా... 2019లో కాంగ్రెస్ పార్టీ అనూహ్య విజయాన్ని నమోదు చేసింది. దీంతో భద్రాచలం రాజకీయాలు ఎప్పటికప్పుడు మారే సమీకరణాల వేదికగా మారాయి.

### ››› రావులపల్లి ఎంట్రీతో మారిన లెక్కలు

2024 ఎన్నికల సమయానికి భద్రాచలంలో బిఆర్ఎస్ అనూహ్యంగా బలపడటానికి ప్రధాన కారణాల్లో రావులపల్లి రాంప్రసాద్ చేరిక ఒకటని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. దశాబ్దాల పాటు వామపక్ష రాజకీయాల్లో పనిచేసిన ఆయనకు ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక ప్రభావం ఉంది. దుమ్ముగూడెం మండలం నరసాపురం గ్రామానికి చెందిన రాంప్రసాద్ రాజకీయ జీవితం ఉద్యమాలతో ముడిపడి ఉంది. విద్యార్థి ఉద్యమాల నుంచి ప్రజా పోరాటాల వరకు ఆయన ప్రస్థానం సాగింది. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, సీపీఐ సంస్థల్లో కీలక పాత్ర పోషించిన ఆయన... గిరిజన సమస్యలపై పోరాట యోధుడిగా గుర్తింపు పొందారు.

### ››› పోడు పోరాటాల నుంచి రాజకీయ ప్రభావం వరకు

దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం, వాజేడు ప్రాంతాల్లో పోడు భూముల సమస్యలపై ఆయన చేసిన పోరాటాలు ఇప్పటికీ ప్రజల్లో చర్చనీయాంశమే. వేలాది ఎకరాల భూములు గిరిజనులకు దక్కేలా చేసిన నాయకుడిగా ఆయనకు పేరుంది. "రావులపల్లి ఎటు ఉంటే... గెలుపు అటే" అనే ప్రచారం ఏజెన్సీలో వినిపించడమే ఆయన క్షేత్రస్థాయి బలానికి నిదర్శనమని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

### ››› కేసీఆర్ వ్యూహంలో భాగమేనా..?

బిఆర్ఎస్ అధిష్టానం ప్రకటించిన



119 నియోజకవర్గ ఇంచార్జిల జాబితాలో రాంప్రసాద్‌కు చోటు కల్పించడం వెనుక స్పష్టమైన రాజకీయ వ్యూహం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. గిరిజన బెల్ట్‌లో మళ్లీ పట్టు సాధించడం... పాత కామ్రేడ్ క్యాడర్‌ను ఆకర్షించడం...కాంగ్రెస్‌కు చెక్ పెట్టడం... గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం. ఇవే లక్ష్యాలుగా కనిపిస్తున్నాయని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ఎమ్మెల్యే పార్టీ మారిన తర్వాత కూడా బిఆర్ఎస్ కేడర్‌ను చీలకుండా నిలబెట్టడంలో రాంప్రసాద్ పాత్ర కీలకమైందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

### ››› కాంగ్రెస్‌కు సవాల్... కామ్రేడ్లకు సంకేతం

ప్రస్తుతం భద్రాచలంలో కాంగ్రెస్ అధికార బలం మీద ముందుకు వెళ్తుండగా... బిఆర్ఎస్ మాత్రం దీర్ఘకాల వ్యూహంతో కదులుతున్నట్లు కనిపిస్తోంది. మరోవైపు వామపక్షాలకు ఇప్పటికీ కొన్ని మండలాల్లో సంప్రదాయ ఓటు బ్యాంక్ ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో రావులపల్లి నియామకం ద్వారా బిఆర్ఎస్ రెండు లక్ష్యాలను ఒకేసారి చేరుకోవాలని చూస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాంగ్రెస్ ఓటు బ్యాంక్‌ను దెబ్బతీయడంతో పాటు... వామపక్ష కేడర్‌ను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

### ››› 2028 గురిపెట్టి గులాబీ వ్యూహం

రాబోయే 2028 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని భద్రాచలంలో ఇప్పటి నుంచే రాజకీయ సమీకరణాలు మార్చే ప్రయత్నం ప్రారంభమైందనే చర్చ జరుగుతోంది. ముఖ్యంగా గ్రామస్థాయి కేడర్ బలోపేతం, గిరిజన వర్గాల్లో పట్టు పెంపు, పాత ఉద్యమ నాయకులను సమీకరించడం వంటి అంశాలపై బిఆర్ఎస్ ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. రావులపల్లి రాంప్రసాద్ సారథ్యంలో భద్రాచలంలో పార్టీకి మళ్లీ పూర్వ వైభవం తీసుకురావాలని బిఆర్ఎస్ భావిస్తుండగా... ఈ వ్యూహం ఎంతవరకు ఫలిస్తుందన్నది రానున్న రోజుల్లో తేలనుంది. ఇది ఇలా ఉండగా భద్రాచలం నియోజకవర్గం బాధ్యతలు స్వీకరించబోతున్న రావులపల్లిని ప్రజా జ్యోతి పలకరించగా ఆయన మాట్లాడుతూ ... భద్రాచలం నియోజకవర్గంలో రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ జెండా ఎగరడమే లక్ష్యంగా పనిచేస్తానని పేర్కొన్నారు. మరోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చూడాలన్నదే తమ ధ్యేయమని స్పష్టం చేశారు.

## అటవీ ప్రాంతంలో చిరుత సంచారం కలకలం



(మొదటి పేజీ తరువాయి...)



జల్లెడ పడుతున్నారు. అటవీ ప్రాంతానికి సమీప గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తూ అధికారులు పలు సూచనలు చేసారు. రాత్రి వేళల్లో అవసరం లేకుండా ఎవరూ అడవి ప్రాంతాల వైపు వెళ్లవద్దని ముఖ్యంగా రైతులు, పశువుల కాపరులు, అటవీ ప్రాంతాలకు వెళ్లే వారు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. చిన్నారులను ఒంటరిగా బయటకు పంపవద్దని, పశువులను అడవిలో మేపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. చిరుత ఎక్కడైనా కనిపించినా, దాని అడుగుజాడలు గమనించినా వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. చిరుతను తరిమేందుకు లేదా దానికి హాని చేసే ప్రయత్నాలు చేయవద్దని స్పష్టం చేశారు. అడవి జంతువులు భయంతో గ్రామాల వైపు వచ్చే అవకాశం ఉంటుందని ప్రజలు గుంపులుగా కదలాలని సూచించారు. ప్రజల భద్రత కోసం అటవీశాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. చిరుత సంచారం నేపథ్యంలో గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు మరోసారి హెచ్చరించారు.ఈ గాలింపు చర్యలో వెంకటాపురం ఎఫ్‌డీఓ ద్వాలియా, చర్ల ఇన్‌చార్జ్ రేంజ్ ఆఫీసర్ రంజిత్, డీఆర్‌వో హట్యా్, జైసింగ్, ఎఫ్ఎస్‌వో రాజేష్, రవికుమార్, ఎఫ్‌బీఓ ఎస్. బాలాజీ, లాలు, బేస్‌క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

## జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలి

- గ్రంధాలయ జిల్లా చైర్మన్ ను కలిసిన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేష్ వినతిపత్రం అందజేత



**టేకులపల్లి,మే22,ప్రజాజ్యోతి:** ఇల్లందు నియోజకవర్గంలోని బోడు,పోలారం,కొమరారంలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని గ్రంధాలయాల అభివృద్ధికి కృషి చేయాలని శుక్రవారం జిల్లా గ్రంధాలయ శాఖ చైర్మన్ పసుపులేటి వీరబాబును తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి భూక్య వెంకటేష్ మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఈ పాఠశాలల గ్రంధాలయాల్లో పుస్తకాల కొరత తీవ్రంగా ఉందని, విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. యువతకు సాధారణ జ్ఞానం పెంచుకునేందుకు అవసరమైన పుస్తకాలు, దినపత్రికలు,మ్యాగజైన్లు అందుబాటులో లేవని వారు తెలిపారు.పుస్తకాలను మంజూరు చేసి గ్రామీణ విద్యార్థులకు అండగా నిలవాలని ఆయనను కోరాగా,చైర్మన్ వీరబాబు సానుకూలంగా స్పందించి త్వరలోనే ఆయా పాఠశాలల గ్రంధాలయాలకు పుస్తకాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని అయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఇల్లందు నియోజకవర్గం జనరల్ సెక్రటరీ దారావత్ చంద్రశేఖర్,టేకులపల్లి మండలం ఉపాధ్యక్షులు చిలివేరు చంద్రశేఖర్,కొప్పు రాయి గ్రామ సర్పంచ్ చింత కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్త ఆసరా పెన్షన్ల పేరుతో పాత లబ్ధిదారులకు కోతలు వేయొద్దు

- : బీఆర్ఎస్ డిమాండ్



**పినపాక,మే 22(ప్రజాజ్యోతి):** కొత్త ఆసరా పెన్షన్ల మంజూరులో భాగంగా పాత పెన్షన్ లబ్ధిదారులకు కోతలు విధించడం అన్యాయమని పినపాక మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 25 నెలలు కావస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కొత్త పెన్షన్ల పేరుతో ఆర్భాటం చేస్తోందని విమర్శించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆసరా పెన్షన్లను రూ.200 నుంచి రూ.2000కు, వికలాంగుల పెన్షన్లను రూ.500 నుంచి రూ.4000కు పెంచి పేదలకు అండగా నిలిచారని గుర్తు చేశారు. వంటరి మహిళలకు కొత్తగా పెన్షన్లు కల్పించడం, 57 సంవత్సరాలకే ఆసరా పెన్షన్ అందించడం వంటి సంక్షేమ కార్యక్రమాలు కేసీఆర్ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు.ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త పెన్షన్లు ఇస్తున్నామని ప్రచారం చేస్తూ పాత లబ్ధిదారులలో సుమారు 50 శాతం మందికి కోతలు విధిస్తోందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి, పాత పెన్షన్లలో ఎలాంటి కోతలు లేకుండా అర్హులైన అందరికీ కొత్త ఆసరా పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.ప్రజల సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ ఎప్పటికప్పుడు పోరాటం చేస్తూనే ఉంటుందని నాయకులు స్పష్టం చేశారు.ఈ సమావేశంలో పినపాక పీఏసీఎస్ చైర్మన్ ఎంవీఎస్ఆర్ఎస్ వర్మ, మండల మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు మొగిలిపల్లి నరసింహారావు, సీనియర్ నాయకులు రాయల సత్యనారాయణ, సూరినేని ధర్మయ్య, సుగ్గాల శ్రీకాంత్, కొట్టెం ప్రసాద్, రుద్రరాజు విశ్వనాధరాజు, బోడ సర్వేశ్వరరావు, ఈసం వెంకటేశ్వర్లు, సింహాద్రి రాజు తదితరులు పాల్గొన్నారు.

## త్రీ ఇంక్లైన్‌లో ఉద్రిక్తత.. సర్పంచ్ భర్తపై దాడి

- రాళ్లు, కూల్‌డ్రింక్ సీసాలతో దాడి చేసినట్లు ఆరోపణలు
- తలకు గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజీవ్ గాంధీ



**చుంచుపల్లి, మే 22 ప్రజాజ్యోతి** చుంచుపల్లి మండలంలోని త్రీ ఇంక్లైన్ గ్రామ పంచాయతీలో శుక్రవారం రాత్రి చోటు చేసుకున్న దాడి ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. త్రీ ఇంక్లైన్ గ్రామ పంచాయతీ సర్పంచ్ గీతం ప్రవళిక భర్త రాజీవ్ గాంధీపై కొందరు వ్యక్తులు రాళ్లు, కూల్‌డ్రింక్ సీసాలతో దాడి చేసినట్లు ఆరోపణలు వెలువడ్డాయి. ఈ ఘటనలో ఆయన తలకు రెండు చోట్ల తీవ్ర గాయాలు కావడంతో వెంటనే కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు కుట్లు వేసి చికిత్స అందించినట్లు తెలిసింది.గ్రామ పంచాయతీ ఎన్నికల సమయంలో సర్పంచ్ గెలుపునకు కృషి చేసిన బొల్లి కార్తీక్‌పై ఇదే పంచాయతీకి చెందిన కట్ట శ్రీనివాస్, నేరెడుమల్లి నవదీప్ ఈ ఏడాది మార్చి 20న దాడి చేసినట్లు సమాచారం. ఆ ఘటనలో కార్తీక్ ముక్కు ఎముక విరగడంతో బాధితుడు రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసుకు సంబంధించిన మెడికల్ రిపోర్ట్ ఏప్రిల్ 21న వచ్చినట్లు సమాచారం. అనంతరం కేసు విచారణ జరిపిన పోలీసులు నిందితులైన శ్రీనివాస్, నవదీప్‌లను గురువారం రిమాండ్‌కు పంపినట్లు తెలిసింది.అయితే తమ కుమారుడు జైలుకు వెళ్లడానికి సర్పంచ్ భర్త రాజీవ్ గాంధీ కారణమని భావించిన నవదీప్ తండ్రి సునీల్ ఆగ్రహంతో గురువారం రాత్రి రాజీవ్ గాంధీపై దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇంటి సమీపంలో జరిగిన ఈ ఘటనతో గ్రామంలో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. స్థానికులు భయాందోళనకు గురయ్యారు. దాడి ఘటనపై బాధిత కుటుంబ సభ్యులు రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు డీఎస్పీ ఆదినారాయణను కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అప్రమత్తంగా ఉన్నట్లు సమాచారం.

# మాదకద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

- జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్



**కొత్తగూడెం కలెక్టరేట్, మే 22, (ప్రజా జ్యోతి)** జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం, అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడిఓసీ కార్యాలయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా స్థాయి మాదక ద్రవ్యాల నివారణ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగంతో వ్యక్తుల జీవితాలు దుర్భరమవుతాయని, ముఖ్యంగా యువత వీటి బారిన పడకుండా ముందస్తు అవగాహన కల్పించడం అత్యంత అవసరమన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు, యువత, కార్మికులకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో గంజాయి ,ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు పటిష్ట నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్మికులు పనిచేసే ప్రాంతాల్లో గంజాయి సరఫరాపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని, మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం, రవాణా వంటి చర్యలను తీవ్రంగా పరిగణించాలని అన్నారు. సంబంధిత శాఖలన్నీ ప్రణాళికబద్ధంగా సమన్వయంతో పనిచేస్తూ నిరంతర తనిఖీలు నిర్వహించాలని సూచించారు.ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వివిధ శాఖలు నిర్వహించిన అవగాహన కార్యక్రమాలపై సమావేశంలో సమీక్ష నిర్వహించారు. గత సమావేశం నుండి ప్రస్తుత సమావేశం వరకు నమోదైన కేసులు, వాటి పురోగతి, మాదకద్రవ్యాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై సమగ్రంగా చర్చించారు.ఆర్టీసీ ద్వారా జరుగుతున్న అక్రమ రవాణాను అరికట్టేందుకు ఆర్టీసీ కండక్టర్లు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని, అనుమానాస్పద వస్తువులపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణా నిర్మూలనకు అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి వి వెంకటరమణ, కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ,జిల్లా డ్రగ్ ఇన్స్పెక్టర్ అశ్విని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 24 నుంచి హెచ్ సీఏ ఆద్వర్యంలో ఉచిత క్రికెట్ శిబిరం



**భద్రాచలం టౌన్, మే 22 ప్రజాజ్యోతి** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భద్రాచలం కాలేజీ గ్రౌండ్ లోని చేతన బెస్ట్ క్రికెట్ అకాడమీ వద్ద ఉచిత సమ్మర్ క్రికెట్ కోచింగ్ శిబిరం ఈనెల 24 నుంచి నిర్వహిస్తున్నట్లు హెచ్ సీఏ ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యదర్శి చెరుకూరి వెంకట్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతానికి చెందిన ప్రతిభావంతులైన యువ క్రీడాకారులను గుర్తించి వారికి నాణ్యమైన క్రికెట్ శిక్షణ అందించడం ద్వారా జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రాణించేలా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రికెట్ ప్రతిభను వెలికితీసేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. భద్రాచలంలో నిర్వహిస్తున్న ఈ సమ్మర్ ఫ్రీ క్రికెట్ కోచింగ్ లో కోచ్ లు చరణ్ తేజ, రవితేజ, శ్రీకాంత్, శిక్షణ అందిస్తున్నారని తెలిపారు. చిన్నారులు, యువతి,యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని క్రికెట్ లో మెరుగైన నైపుణ్యాలు సాధించాలని చెరుకూరి వెంకట్ కోరారు.

## ఆది కర్మయోగి కార్యక్రమంలో భాగంగా హెల్త్ క్యాంపుల నిర్వహణ



**పాల్వంచ, మే 22, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు పాల్వంచ మండల రూరల్ పరిధిలోని రంగాపురం, తోగ్గుడెం తదితర గ్రామపంచాయతీల్లో శుక్రవారం "ఆది కర్మయోగి" కార్యక్రమంలో భాగంగా ఉచిత హెల్త్ క్యాంపులు నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గిరిజన గ్రామాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, సేవలను ఎలాంటి అవినీతి లేకుండా చివరి వ్యక్తి వరకు చేరవేయడం, గ్రామ స్థాయిలో నాయకత్వాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని పిహెచ్సీ వైద్యులు సూచించారు. క్యాంపుల్లో గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు, మందులు అందజేశారు.ఈ కార్యక్రమంలో జగన్నాధపురం పిహెచ్సీ వైద్య సిబ్బందితో పాటు ప్రభుత్వ వైద్యులు, గ్రామపంచాయతీ సర్పంచ్ శుభ, కార్యదర్శులు రవి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు



**భద్రాచలం టౌన్, మే 22 ప్రజాజ్యోతి** భద్రాచలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు చేతుల మీదుగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. భద్రాచలం పట్టణంకు చెందిన ఆరుగురు వ్యక్తుల పేరిట వచ్చిన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

## దళిత ఉద్యోగులపై బెదిరింపులు ఆపాలి

- అనుకూలంగా పనిచేస్తే జేజేలు... వ్యతిరేకంగా పని చేస్తే బెదిరింపులా
- దళిత సంఘం జేఏసీ నాయకులు సోంపల్లి తిరుపతి

**పినపాక,మే 22(ప్రజాజ్యోతి):** పినపాక మండలంలో దళిత ఉద్యోగులపై కొంతమంది రాజకీయ నాయకులు బెదిరింపులకు పాల్పడుతున్నారని అది తమ దృష్టికి వచ్చిందని, దళిత అధికారులను బెదిరించి పని చేసుకోవాలని చూస్తే దళిత సమాజం చూస్తూ ఊరుకోదని దళిత సంఘం జేఏసీ నాయకులు సోంపల్లి తిరుపతి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శుక్రవారం పినపాక మండలం సీతారాంపురం గ్రామం వద్ద ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత అధికారులు తప్పు క్షమించమని, కానీ దళిత అధికారుల చేత బెదిరింపులకు గురిచేసి తప్పు చేయించాలని చూస్తే తగిన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. దళిత సమా జం అంబేద్కర్ రాజ్యాంగం వల్ల కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించారని, దొంగ దారిన వచ్చిన జీవోలతో ఉద్యోగాలు సాధించలేదని ఆయన విమర్శించారు. ఒక శాతం లేని వారు 10% పొందుతుంటే ఆనందపడే మీరు మా రిజర్వేషన్లలో మేము ఉద్యోగాలు పొందుతుంటే ఏడుపు ఎందుకని తీవ్రస్థాయిలో విమర్శించారు. అధికారులకు అండగా ఉంటామని తెలియజేశారు. ఈ సమావేశంలో దళిత సంఘం జిల్లా నాయకులు అలవాల వెంకటేశ్వర్లు, విద్యార్థి సంఘం నాయకులు కోడి రెక్కల సంతోష్, కొప్పుల జస్వంత్, దళిత సంఘం మండల నాయకులు కొప్పుల లక్ష్మణ్, సోంపల్లి సిసింద్రీ, తదితరులు పాల్గొన్నారు.



# మినరల్ వాటర్ సురక్షితమేనా..?

- ఇష్టారాజ్యంగా వెలుస్తున్న వాటర్ ప్లాంట్లు..!
- నాణ్యత ప్రమాణాలు గాలికి..?
- క్యాన్ లను శుభ్రం చేయని నిర్వాహకులు..?
- వేసవి తాకిడికి పెరిగిన వినియోగం..!
- తయారీపై పర్యవేక్షణ కరువు..?
- అసలు వాటర్ ప్లాంట్లకు అనుమతులు ఉన్నాయా..?
- తనిఖీలు నిర్వహించని అధికారులు..?





**ఇల్లందు, మే 22, ప్రజాజ్యోతి:** ఇల్లందుతో పాటు పరిసర ప్రాంతాల్లో తయారవుతున్న మినరల్ వాటర్ సురక్షితమేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నేటి ఆధునిక యుగంలో సుమారుగా 80 శాతానికి పైగా మినరల్ వాటర్ కు అలవాటు పడ్డారు. ఎక్కడికి వెళ్లినా కానీ ఎవరైనా మంచిని ఇస్తే మినరల్ వాటరా లేవా.. అని అడిగే పరిస్థితి నెలకొంది. ఇలా ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకొని ఈ మధ్య కాలంలో ఇష్టానుసారంగా మినరల్ వాటర్ ప్లాంట్లు వెలుస్తున్నాయి. ముఖ్యంగా ఈ వాటర్ ప్లాంట్లకు అనుమతులు ఉన్నాయో లేవో తెలియని పరిస్థితి. ప్రధానంగా నీటిని క్రమ పద్ధతిలో శుద్ధి చేస్తున్నారా..? నీటి నమూనాలు సేకరిస్తున్నారా...? తదితర అనేక అనుమానాలు సైతం వ్యక్తమవుతున్నాయి. వేసవి తాకిడికి తాగునీటి వినియోగం ఎక్కువ కావడం వల్ల మెజార్టీ ప్రజలు మినరల్ వాటర్ వైపు ఆసక్తి చూపుతున్నారు. వాటర్ ప్లాంట్లలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదనే విమర్శలున్నాయి. ప్రజా ఆరోగ్యానికి సం బంధించిన ముఖ్యమైన అంశాలపై అధికారులు దృష్టి పెట్టకపోవడం పట్ల సర్వత్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇల్లందు, పరిసర ప్రాంతాలలో పదుల సంఖ్యలో ఇల్లందుతో పాటు పరిసర ప్రాంతాల్లో తయారవుతున్న మినరల్ వాటర్ సురక్షితమేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నేటి ఆధునిక యుగంలో సుమారుగా 80 శాతానికి పైగా మినరల్ వాటర్ కు అలవాటు పడ్డారు. ఎక్కడికి వెళ్లినా కానీ ఎవరైనా మంచిని ఇస్తే మినరల్ వాటరా లేవా.. అని అడిగే పరిస్థితి నెలకొంది. ఇలా ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకొని ఈ మధ్య కాలంలో ఇష్టానుసారంగా మినరల్ వాటర్ ప్లాంట్లు వెలుస్తున్నాయి. ముఖ్యంగా ఈ వాటర్ ప్లాంట్లకు అనుమతులు ఉన్నాయో లేవో తెలియని పరిస్థితి. ప్రధానంగా నీటిని క్రమ పద్ధతిలో శుద్ధి చేస్తున్నారా..? నీటి నమూనాలు సేకరిస్తున్నారా...? తదితర అనేక అనుమానాలు సైతం వ్యక్తమవుతున్నాయి. వేసవి తాకిడికి తాగునీటి వినియోగం ఎక్కువ కావడం వల్ల మెజార్టీ ప్రజలు మినరల్ వాటర్ వైపు ఆసక్తి చూపుతున్నారు. వాటర్ ప్లాంట్లలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదనే విమర్శలున్నాయి. ప్రజా ఆరోగ్యానికి సంబంధించిన ముఖ్యమైన అంశాలపై అధికారులు దృష్టి పెట్టకపోవడం పట్ల సర్వత్రం అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్లాంట్లలో నీటి నమూనాలను సేకరించి నిర్ధరిస్తున్నారా..? నీళ్లను క్రమ పద్ధతిలో శుద్ధి నిర్వాహకులు మాత్రం కొంతమేర నిబంధనలు పాటిస్తున్నట్లు సమాచారం.

### »» క్రమ పద్ధతిలో కానరాని శుద్ధి

మినరల్ వాటర్ ప్లాంట్లలో నీటిని క్రమ పద్ధతిలో శు ద్ధి చేయడం లేదనే విమర్శలున్నాయి. బోరు నుండి వచ్చే నీటిలో మోతాదుకు మించి మినరల్స్ ఉంటాయి. మెగ్నీషియం, సల్ఫేట్, బోరాన్, మాంగనీస్ తదితర మినరల్ అతిగా ఉంటే అవి మనిషి శరీరానికి హాని కలిగిస్తాయి. ఈ జలాలను ఆర్ఎ ప్లాంట్ల ద్వారా శుద్ధి చేసి సాధారణ జలాలుగా మార్చుతారు. భార జలాలను ఆర్ఓ ప్లాంట్ల ద్వారా 3 దశల్లో ఫిల్టర్ చేస్తారు. మొదటి దశలో ఫ్రీ ఫైల్టరైజేషన్ సాలిడ్ వాటర్, రెండవ దశలో ఉప్పు శాతాన్ని తగ్గించడం, మూడోదశలో బ్యాక్టీరియాను తగ్గిస్తారు. మూడు దశల్లో ఏమాత్రం హెచ్చు తగ్గులు ఉన్న నీరు ఆరోగ్యానికి హానికరమని నిపుణులు అంటున్నారు. 100 లీటర్లను ఆర్ ప్లాంట్ ద్వారా ఫిల్టర్ చేస్తే కేవలం 10 నుండి 15 లీటర్ల తాగునీరు మాత్రమే వస్తాయి. మిగిలిన నీరు తాగడానికి పనికిరాదు. అంతేకాకుండా గుర్తింపు పొందిన ఆర్ఓ ప్లాంట్లలో సైతం కనీస నిబంధనలు పాటించడం లేదనే విమర్శలున్నాయి. ప్రధానంగా ఒక బోరు వేసి భారీ ప్లాస్టిక్ వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేసుకొని మినరల్ వాటర్ దందా కొనసాగిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏ అధికారి పర్యవేక్షణ ఉండదనే ధీమాలో వాటర్ ప్లాంట్లను నెలకొల్పి ప్రజల ప్రాణాలతో చెరగాటం ఆడుతున్న ఏ ఒక్క అధికారి అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవనేది తెలుస్తుంది.

### »» ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం

మినరల్ వాటర్ ప్లాంట్ లు ఉన్నాయి. ఇవి కాకుండా ఐఎస్ఐ మార్కు కలిగిన బ్రాండెడ్ మినరల్ వాటర్ కంపెనీలు బాటిల్స్, క్యాన్లలో నీటిని సరఫరా చేస్తుంటారు. అయితే ఈ నీరు ఎంత సురక్షితం అనే అనుమానాలు లేకపోలేదు. వేసవిలో రూ.కోట్ల వ్యాపారాన్ని నిర్వహించే మినరల్ వాటర్ ప్లాంట్లపై పర్యవేక్షణ ఎవరూ చూస్తున్నారనే దానిపై స్పష్టమైన మార్గదర్శకాలు లేవని చెప్పొచ్చు. ఈ వాటర్ చేస్తున్నారా..? ఇవి తాగడానికి సురక్షితమేనా..? అని పర్యవేక్షించే వారెవ్వరూ లేకపోవడంతో వాటర్ ప్లాంట్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు లేకపోలేదు. వాటర్ ప్లాంట్ల నుంచి సరఫరా చేసే వాటర్ క్యాన్లు 90 సార్ల కంటే ఎక్కువగా వినియోగించితే అవి ఉపయోగించకూడదు. వాటర్ ప్లాంట్లలో ఏళ్ల తరబడి క్యాన్లను మార్చిన దాఖలాలు లేవని తెలుస్తుంది. కొన్ని వాటర్ ప్లాంట్ల మినరల్ వాటర్ నాణ్యతపై అనేక అనుమానాలు ఉన్నాయి. క్రమ పద్ధతిలో కాకుండా ఇష్టారాజ్యంగా తయారు చేస్తుండడం వల్ల ఇవి నిత్యం తాగితే దీర్ఘ కాలంలో అనేక వ్యాధులు సక్రమించే అవకాశాలు ఉ న్నాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ఖ్యంగా కీళ్ల నొప్పులకు ఆస్కారం ఉందనే ప్రచారం బాగా ఉంది. వీటివల్ల డయేరియా, టైఫాయిడ్, కలరా వంటి సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశాలు లేకపోలేదు. టోటల్ డిస్పెన్సన్ సాలిడ్ (టీడీఎస్) 100 నుండి 300 శాతం లోపు ఉండాలి. ఇవి తక్కువైనా, ఎక్కువైనా హానికరమే. ఫుడ్ ఇన్స్ స్పెక్టర్లు మాత్రం తాము ప్యాకేజీ వాటర్ బాటిల్స్, పౌచులను మాత్రమే పర్యవేక్షించే అధికారం ఉందని అంటున్నట్లు సమాచారం. 20 లీటర్ల క్యాన్లతో పాటు పెద్ద పెద్ద డ్రమ్ములలో మినరల్ వాటర్ నింపి ట్రాలీ, ఆటోలలో అమ్మే వాటర్ ను స్థానిక సంస్థలు పర్యవేక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిబంధనలు పాటించకుండా ఇస్తాను రాజ్యంగా నెలకొల్పిన వాటర్ ప్లాంట్లను తనిఖీలు చేపట్టి నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని, ప్రజల ప్రాణాలను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

## మా సాగు భూములు లాక్కున్నారు

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆవేదనను వ్యక్తం చేసిన ఆదివాసి మహిళలు



**అశ్వాపురం, మే 22, ప్రజా జ్యోతి** అశ్వాపురం మండలంలోని భీముడు గుండం కొత్తూరు గ్రామ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేయనున్న నవోదయ పాఠశాల కోసం తాము ఏండ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూములను తీసుకున్నారని బోరుమంటూ ఆదివాసి మహిళలు శుక్రవారం అశ్వాపురం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆశ్రయించారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ తాము సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న భూములను ముందస్తు సమాచారం లేకుండా స్వాధీనం చేసుకోవడం వల్ల కుటుంబాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భూముల విషయంలో సరైన పరిశీలన చేసి తమకు న్యాయం చేయాలని, ప్రత్యామ్నాయ భూములు లేదా తగిన పరిహారం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. వారి వినతి పత్రం ని స్వీకరించిన అధికారులు సమస్యను పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం.

## భద్రాద్రి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్‌గా గద్దల రమేష్ నియామకం



**పాల్వంచ, మే 22, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్‌గా గద్దల రమేష్‌ను నియమిస్తూ రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో అధికారికంగా ప్రకటించారు.ఈ సందర్భంగా గద్దల రమేష్ మాట్లాడుతూ పార్టీ కోసం నిరంతరం కష్టపడి పనిచేసిన తన సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించడం ఆనందంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేని సమయంలో కూడా పార్టీ సిద్ధాంతాలను నమ్ముకుని ముందుకు సాగానని తెలిపారు. గతంలో ప్రత్యర్థి పార్టీల నుంచి అనేక ఇబ్బందులు, అక్రమ కేసులు ఎదురైనా భయపడకుండా పార్టీ కోసం శ్రమించానని పేర్కొన్నారు.తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భద్రాద్రి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## రైతులకు శాస్త్రీయ వ్యవసాయ శిక్షణ

- ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలి
- భూసారం కాపాడాలి.. రైతులకు శాస్త్రవేత్తల పిలుపు






**చర్ల, మే 22: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలం సత్యనారాయణపురం గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలనా ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ అవగాహన కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. టి. భరత్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వరి రకాలను ఎంపిక చేసుకొని సాగు చేయాలని సూచించారు. ముఖ్యంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం విడుదల చేసిన వంగడాలను సాగు చేస్తే రైతులకు మంచి దిగుబడులు, ఆదాయం లభిస్తాయని తెలిపారు.అలాగే రైతులు పోటీ తత్వంతో అధిక మోతాదులో రసాయన ఎరువులు వినియోగించడం వల్ల భూసారం దెబ్బతింటుందని హెచ్చరించారు. విచక్షణతో ఎరువుల వినియోగం చేపట్టాలని, పురుగు మందులను అధికంగా వాడకుండా వేపనూనె పిచికారీ, జిగురు అట్టల వినియోగం వంటి సహజ పద్ధతులను పాటించాలని సూచించారు. ప్రతి రైతు ఇంటి వద్దనే ప్రకృతి వ్యవసాయ విధానంలో కూరగాయలు సాగు చేయాలని కోరారు.ఉద్యాన శాస్త్రవేత్త బి. శివ మాట్లాడుతూ రైతులు ఒకే రకమైన పంటల సాగుపై ఆధారపడకుండా పంట మార్పిడి విధానాన్ని పాటించాలని తెలిపారు. ముఖ్యంగా ఆయిల్ పామ్ వంటి పంటల సాగుతో రైతులకు సుస్థిర ఆదాయం లభించడంతో పాటు నేల ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని చెప్పారు.చర్ల మండల వ్యవసాయ అధికారి శ్రీలావణ్య మాట్లాడుతూ రైతులు పచ్చిరొట్ట పైర్ల సాగు ద్వారా నేల సారాన్ని కాపాడుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్స్ రిజిస్ట్రీ నమోదు చేసుకోవాలని కోరారు.ఐటీసీ ఎంఎస్‌కే బంగారు భవిష్యత్తు సంస్థ సహకారంతో మైరాడ ఎన్‌జీఓ ప్రతినిధి సాయి షణ్ముఖ్ మాట్లాడుతూ రైతులు వరి సాగులో వెదజల్లే విధానాన్ని పాటించడం ద్వారా ఖర్చులు తగ్గించుకోవచ్చని తెలిపారు.సుమారు 90 మంది రైతులు హాజరై శాస్త్రవేత్తల సూచనలు తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో రామకృష్ణ, ఆఫ్రిధ్, వినీల, వ్యవసాయ విస్తరణ అధికారులు, మైరాడ సోషల్ మొబలైజర్ నవీన్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ మ్యాపింగ్‌లో రాజకీయ పార్టీల పాత్ర కీలకం

- బూత్ స్థాయి ప్రతినిధుల వివరాలు తక్షణం అందజేయాలి
- సూచించిన సహాయ ఎన్నికల అధికారి హుస్సేన్






**అన్నపురెడ్డిపల్లి, మే 22, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ ప్రక్రియపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. అశ్వారావుపేట నియోజకవర్గం సహాయ ఎన్నికల అధికారి హుస్సేన్ సమావేశంలో పాల్గొని ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణ, ఓటరు జాబితా సవరణలు, ఇంటింటి సర్వే కార్యక్రమంపై వివరాలు వెల్లడించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో చేపట్టనున్న ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను పారదర్శకంగా, ఖచ్చితంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని కోరారు. ప్రతి రాజకీయ పార్టీ తమ బూత్ స్థాయి ప్రతినిధుల వివరాలను తక్షణం అందజేయాలని సూచించారు. బీఎల్‌వోలు నిర్వహించే ఇంటింటి సర్వే కార్యక్రమానికి రాజకీయ పార్టీల సహకారం ఎంతో అవసరమని తెలిపారు.జూన్ 2026 నుంచి బీఎల్‌వోలు ఇంటింటి సర్వే నిర్వహించి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తారని చెప్పారు. ప్రతి ఓటరు ఇంటిని కనీసం ఒక్కసారైనా సందర్శించి అవసరమైతే మూడు సార్లు వరకు వెళ్లి ఫారాలను సేకరిస్తారని వివరించారు. ఓటర్ల వివరాలు ఖచ్చితంగా నమోదు కావడానికి ప్రతి కుటుంబం సహకరించాలని కోరారు.అన్నపురెడ్డిపల్లి మండలంలో మొత్తం 16,641 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. అందులో ఇప్పటికే 16,359 మంది ఓటర్ల డాటా మ్యాపింగ్ పూర్తయిందన్నారు. ఇంకా 282 మంది ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. అనామలీస్ సంఖ్య 4,735గా నమోదైనట్లు వెల్లడించారు. 118 అశ్వారావుపేట నియోజకవర్గం డాటా మ్యాపింగ్‌లో రాష్ట్ర స్థాయిలో 91.74 శాతం సాధించి తొలి స్థానంలో నిలిచిందని తెలిపారు. ఇది అధికార యంత్రాంగం సమిష్టికృషితో సాధ్యమైందన్నారు.ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ ప్రక్రియ జూన్ 26 నుంచి ప్రారంభమై జూలై 24లోపు పూర్తవుతుందని తెలిపారు. జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు చెప్పారు. జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరిస్తామని తెలిపారు. అనంతరం అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా విడుదల చేస్తామని వెల్లడించారు.చిరునామా మార్పులు, ఇతర సవరణల కోసం ఫారం-8 ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ఓటర్లు తమ పేరు ఎస్ఐఆర్-2002 జాబితాలో ఉందో లేదో తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి అధికారిక వెబ్‌సైట్ లేదా ఈసీఐ ఓటర్స్ పోర్టల్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ఆధార్ నంబర్ ఇవ్వడం పూర్తిగా ఐచ్ఛికమని స్పష్టం చేశారు.18 సంవత్సరాలు పూర్తిచేసుకున్న వారు ఫారం-6 ద్వారా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అక్టోబర్ 1, 2026 నాటికి 18 సంవత్సరాలు పూర్తిచేసుకునే వారికి కూడా నమోదు అవకాశం ఉంటుందని చెప్పారు. ఫారం నింపడంలో లేదా వివరాల ధృవీకరణలో సహాయం కోసం బీఎల్‌వోలు, 1950 హెల్ప్‌లైన్ సేవలు వినియోగించుకోవచ్చని సూచించారు.విదేశాల్లో లేదా ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగాలు చేస్తున్న ఓటర్ల తరపున కుటుంబంలోని పెద్ద సభ్యుడు ఫారం నింపి బీఎల్‌వోకు అందజేయవచ్చని తెలిపారు. అనంతరం ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రాముఖ్యత, ఫారాల నింపే విధానం, ఓటరు జాబితా సవరణలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అన్నపురెడ్డిపల్లి మండల తహసీల్దార్ స్వర్ణ, అశ్వారావుపేట నియోజకవర్గం సహాయ ఎన్నికల అధికారి హుస్సేన్, రాజకీయ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# గంజాయిపై భద్రాద్రి పోలీసుల ఉక్కుపాదం

- ఒక్కరోజే రూ.2 కోట్ల విలువైన 385 కేజీల గంజాయి స్వాధీనం
- అంతర్రాష్ట్ర ముఠాలపై పోలీసుల కఠిన చర్యలు
- అశ్వారావుపేట, లక్ష్మీదేవిపల్లి ప్రాంతాల్లో వరుస తనిఖీలు
- 2024 నుంచి ఇప్పటివరకు రూ.77 కోట్ల విలువైన గంజాయి సీజ్







**కొత్తగూడెం, మే 22 ( ప్రజాజ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక వాహన తనిఖీలలో భారీ మొత్తంలో గంజాయి పట్టుబడుతోంది. తాజాగా జిల్లాలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో ఏకంగా 385 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.2 కోట్ల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. జిల్లాలో గంజాయి రవాణాపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు చెక్‌పోస్టులు, ప్రధాన రహదారులు, అంతర్రాష్ట్ర మార్గాల్లో నిరంతర తనిఖీలు చేపడుతున్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ – ఒడిశా సరిహద్దుల నుంచి తెలంగాణ మీదుగా ఇతర రాష్ట్రాలకు గంజాయి తరలిస్తున్న ముఠాలను లక్ష్యంగా చేసుకుని టాస్క్ ఫోర్స్, స్థానిక పోలీసులతో కలిసి ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు.

### ››› అశ్వారావుపేట చెక్‌పోస్ట్ వద్ద భారీ పట్టివేత

అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్టీఓ చెక్‌పోస్ట్ వద్ద అశ్వారావుపేట పోలీసులు, టాస్క్ ఫోర్స్ సిబ్బంది సంయుక్తంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ – ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి రాజస్థాన్‌కు వెళ్తున్న అనుమానాస్పద వాహనాలను ఆపి తనిఖీ చేశారు. తనిఖీల్లో ఒక లారీ, ఒక కారులో అక్రమంగా తరలిస్తున్న 300 కిలోల గంజాయిని గుర్తించారు. వెంటనే వాహనాలను స్వాధీనం చేసుకుని నలుగురు సభ్యుల అంతర్రాష్ట్ర ముఠాను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నిందితులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల సమాచారం ప్రకారం ఈ ముఠా ఒడిశా ప్రాంతం నుంచి గంజాయిని సేకరించి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పట్టుబడిన నిందితుల నుంచి మరిన్ని వివరాలు రాబట్టేందుకు పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

### ››› లక్ష్మీదేవిపల్లిలో పోలీసుల తనిఖీలకు చిక్కిన గంజాయి ముఠా

అదేవిధంగా లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో మరో భారీ గంజాయి రవాణా కేసు వెలుగులోకి వచ్చింది. ఒడిశా నుంచి బెంగళూరు వైపు వెళ్తున్న కారును తనిఖీ చేసిన పోలీసులు అందులో దాచిపెట్టి తరలిస్తున్న 85 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని వాహనాన్ని సీజ్ చేశారు. వారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. జిల్లాను గంజాయి రవాణాకు ట్రాన్సిట్ పాయింట్‌గా ఉపయోగించాలనే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుకుంటామని పోలీసులు స్పష్టం చేస్తున్నారు.

### ››› గంజాయి రవాణాపై జిల్లాలో నిరంతర నిఘా

జిల్లాలో గంజాయి అక్రమ రవాణాపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలపై దృష్టి సారిస్తూ చెక్‌పోస్టుల వద్ద నిరంతర తనిఖీలు చేపడుతున్నారు. రాత్రి వేళల్లో కూడా ప్రత్యేక బృందాలు గస్తీ నిర్వహిస్తూ అనుమానాస్పద వాహనాలను తనిఖీ చేస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భౌగోళిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అంతర్రాష్ట్ర ముఠాలు జిల్లాను మార్గంగా ఉపయోగించుకునే అవకాశాలు ఉండటంతో పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. టాస్క్ ఫోర్స్, స్థానిక పోలీసులు సమన్వయంతో పని చేస్తూ గంజాయి రవాణాను అడ్డుకునేందుకు కటదిట్టమైన చర్యలు చేపడుతున్నారు.

### ››› 2024 నుంచి భారీగా గంజాయి స్వాధీనం

జిల్లాలో 2024 సంవత్సరం నుంచి ఇప్పటివరకు గంజాయి రవాణాపై పోలీసులు విస్తృత స్థాయిలో చర్యలు చేపట్టారు. ఈ కాలంలో మొత్తం 212 కేసులు నమోదు చేసి 15,398 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.77 కోట్ల వరకు ఉంటుందని అధికారులు వెల్లడించారు. ఈ కేసుల్లో మొత్తం 677 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అంతే కాకుండా గంజాయి అక్రమ రవాణాలో కీలక పాత్ర పోషిస్తున్న ముగ్గురిపై పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపినట్లు పోలీసులు తెలిపారు.

### ››› గంజాయి సేవిస్తున్న వారిపై కూడా భద్రాద్రి పోలీసుల ఫోకస్

కేవలం రవాణాదారులపైనే కాకుండా గంజాయి సేవిస్తున్న వారిపై కూడా పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ తెలిపారు. జిల్లాలో గంజాయి అలవాటుకు గురైన పదిమందిని గుర్తించి వారిని డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలించినట్లు తెలిపారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎవరైనా గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లు, నిల్వ ఉంచుతున్నట్లు, సేవిస్తున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ప్రజలను కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ భారీ గంజాయి పట్టివేతలో కీలకంగా పనిచేసిన టాస్క్ ఫోర్స్ సిబ్బంది, అశ్వారావుపేట పోలీసులు, లక్ష్మీదేవిపల్లి పోలీసులు మరియు సంబంధిత సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## జనగణనను పక్కాగా, నిబంధనల ప్రకారం పూర్తి చేయాలి

- తహసిల్దార్ ఎల్. వీరభద్రం



**టేకులపల్లి,మే22, ప్రజాజ్యోతి:** జనగణన-2027 సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లతో టేకులపల్లి తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ ఎం వీరభద్రం ఆధ్వర్యంలో శుక్రవారం అత్యవసర సమా వేశాన్ని నిర్వహించారు.రెండు వారాలుగా క్షేత్ర స్థాయిలో జరుగు తున్న జనగణన ప్రక్రియను ఆయన నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి ఎదురవుతున్న లోటుపాట్లు, క్షేత్రస్థాయి సమస్యలను అడిగి తెలుసుకొని,వాటికి తగిన పరిష్కార మార్గాలను చూపెట్టారు.ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేసి మండలంలో జనగణన కార్యక్రమాన్ని వంద శాతం విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు తహసిల్దార్ పలు కీలక సూచనలు, నియమ నిబంధనలను జారీ చేయడం జరిగింది.ఎన్యుమరేటర్ తమకు కేటాయించిన ఇళ్లను తప్పనిసరిగా సందర్శించాలని సూచించారు. నిర్దేశిత నిబంధనల ప్రకారమే సర్వే సాగాలని తెలిపారు. ప్రభుత్వం రూపొందించిన 34 ప్రశ్నలకు ఇంటి సభ్యుల నుంచి నేరుగా సమాధానాలు సేకరించాలి.ఎలాంటి ఊహాజనిత సమాచారానికి తావులేకుండా, నిజమైన వివరాలను మాత్రమే మొబైల్ యాప్‌లో నమోదు చేయాలి అని ఆదేశించారు.డేటా నమోదులో ఎలాంటి తప్పులు దొర్లకూడదని,రోజు సాయంత్రం 4:00 గంటలకల్లా ఎన్ని ఇళ్లను సర్వే చేశారనే నివేదికను (రిపోర్టు) తప్పనిసరిగా తహసిల్దార్ కార్యాలయానికి సమర్పించాలని గడువు విధించారు.మరోవైపు, ప్రస్తుతం మండలంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సిబ్బంది తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని తహసిల్దార్ వీరభద్రం హితవు పలికారు. క్షేత్రస్థాయిలో సర్వే చేసేటప్పుడు ఎండదెబ్బ తగలకుండా గొడుగులు వాడటం, వెంట తగినంత తాగునీరు ఉంచుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యాన్ని కాపాడుకుంటూనే, ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ జనగణన విధులను ఎలాంటి అలసత్వం వహించకుండా, పారదర్శకంగా పూర్తి చేసి మండల కీర్తిని చాటాలని సూపర్వైజర్లు, ఎన్యుమ రేటర్లను ఆయన కోరారు.

# కార్మిక పోరాటాల చిరస్మరణీయ యోధుడు పర్సా

- కార్మిక హక్కుల రక్షణకై పోరాటాలే పర్సాకు నిజమైన నివాళి
- ఉద్యమాల అగ్నిజ్వాలగా నిలిచిన పర్సా సత్యనారాయణ
- వీర తెలంగాణ సాయుధ పోరాట యోధుడి సేవలను స్మరించిన నేతలు
- పర్సా 11వ వర్ధంతి సందర్భంగా స్థూపావిష్కరణ సభ ఘనంగా నిర్వహణ








**కొత్తగూడెం, మే 22 ( ప్రజాజ్యోతి )** కార్మిక హక్కుల రక్షణ కోసం నిరంతరం పోరాడటమే కార్మికోద్యమ నేత, వీర తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎమ్మెల్యే పర్సా సత్యనారాయణకు ఇచ్చే ఘనమైన నివాళి అని సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు పి. రాజారావు పేర్కొన్నారు. పర్సా సత్యనారాయణ 11వ వర్ధంతి సందర్భంగా స్థానిక సెవెన్ హిల్స్ సమీపంలో నిర్మించిన పర్సా స్థూపాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముందుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన సభలో పలువురు నాయకులు పర్సా సత్యనారాయణ సేవలను స్మరించుకున్నారు.

సింగరేణి కార్మికోద్యమానికి పునాది వేసిన నాయకుడుసభలో పి. రాజారావు మాట్లాడుతూ గుంటూరు జిల్లా నుంచి కారేపల్లికి వచ్చిన పర్సా సత్యనారాయణ అక్కడి ప్రజలతో మమేకమై కార్మిక జీవితాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ఆ సమయంలో మిన్ని కంటి పర్వతాలు అనే మిత్రుడు పర్సాకు ఆశ్రయం కల్పించగా అనంతరం సింగరేణి హెడ్ ఆఫీసులో పని చేసే దేవూరు శేషగిరిరావుతో పరిచయం ఏర్పడిందన్నారు. అప్పటికే కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం కోసం సుందరయ్య కొత్తగూడెంకు పంపిన శేషగిరిరావు ద్వారా పర్సాకు కార్మికోద్యమంతో అనుబంధం ఏర్పడిందన్నారు. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో రాజకీయ, ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలపై తీవ్ర ఆంక్షలు ఉన్నప్పటికీ పర్సా రహస్యంగా కార్మిక ఉద్యమాన్ని ముందుకు నడిపించారని తెలిపారు. 1945 జూన్ 16న కొత్తగూడెంలో యూనియన్ ఏర్పాటు చేయడంలో పర్సా కీలక పాత్ర పోషించారని యూనియన్ కార్యకలాపాలు విస్తరించడంతో కంపెనీ యాజమాన్యం ఆయనను ఉద్యోగం నుంచి తొలగించిందన్నారు. అయితే వేలాది మంది కార్మికులు హెడ్ ఆఫీస్ ముందు బైఠాయించి పోరాడడంతో యాజమాన్యం వెనక్కి తగ్గి తిరిగి ఉద్యోగంలోకి తీసుకుందని గుర్తు చేశారు. ఈ పోరాటమే పర్సాను కార్మిక వర్గంలో గొప్ప నాయకుడిగా నిలబెట్టిందన్నారు. అనంతరం ఉద్యోగానికి రాజీనామా చేసి పూర్తి స్థాయిలో కార్మికోద్యమానికి అంకితమయ్యారని చెప్పారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం పనిచేసి తన జీవితాన్ని పూర్తిగా కార్మిక ఉద్యమానికి అంకితం చేశారని కొనియాడారు.

### నిర్బంధాల మధ్య ఉద్యమాన్ని ముందుకు నడిపిన పర్సా

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ 1946 మేడే కార్యక్రమాల అనంతరం 1947లో పర్సా అరెస్టై 1953 వరకు జైలులోనే ఉన్నారని తెలిపారు. 1949లో ఔరంగాబాద్ జైలు నుంచి తప్పించుకుని తిరిగి ఉద్యమంలో చురుకుగా పనిచేశారని గుర్తు చేశారు. తర్వాత ఎఐటియుసి, అనంతరం సిఐటియులో కీలక బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. 1962లో ఎమ్మెల్యేగా గెలిచి కొత్తగూడెం ప్రాంత అభివృద్ధికి విశేష కృషి చేశారని చెప్పారు. విశాఖ ఉక్కు ఉద్యమంలో భాగంగా పార్టీ నిర్ణయం మేరకు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఉద్యమానికి అంకితమయ్యారని గుర్తు చేశారు.

### కార్యకర్తలకు అండగా నిలిచిన నాయకుడు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బండారు రవికుమార్ మాట్లాడుతూ పర్సా సత్యనారాయణ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకునేవారని తెలిపారు. ఎక్కడ ఉన్నా కార్యకర్తల యోగక్షేమాలు తెలుసుకుంటూ ఉత్తర ప్రత్యుత్తరాలు కొనసాగించేవారని చెప్పారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా మహాసభల్లో పర్సా ప్రసంగాలు కార్యకర్తల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపేవని అన్నారు. అమరజీవులు బండారు చంద్రారావు, బత్తుల భీష్మారావు హత్యల సమయంలో ఆయన తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారని గుర్తు చేశారు. ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని కార్యకర్తలకు ప్రేరణ ఇచ్చిన నాయకుడు పర్సా అని కొనియాడారు.

### త్యాగానికి, నిరాడంబర జీవితానికి ప్రతీక

ఏపీ రాష్ట్ర కమిటీ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ పర్సా తన జీవితాన్ని పూర్తిగా కార్మిక ఉద్యమం, కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి అంకితం చేశారని తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో ప్రజలు ఇచ్చిన ఆర్థిక సహాయాన్ని కూడా సిఐటియు ఉద్యమానికి విరాళంగా ఇచ్చారని గుర్తు చేశారు. నిరుపేద కుటుంబం నుంచి వచ్చి రాష్ట్రస్థాయి నాయకుడిగా ఎదిగినా జీవితాంతం నిరాడంబరంగా జీవించారని చెప్పారు. కమ్యూనిస్టు విలువలకు కట్టుబడి జీవించిన పర్సా జీవితం నేటి తరానికి ఆదర్శమన్నారు.

### అధ్యయనంతోనే నాయకుడిగా ఎదిగారు

పర్సా సత్యనారాయణ కుమార్తె లీల మాట్లాడుతూ తన తండ్రి ఉద్యమ జీవితంలో ఎన్నో కష్టాలు, నిర్బంధాలు ఎదుర్కొన్నప్పటికీ ఎప్పుడూ వెనక్కి తగ్గలేదన్నారు. నిరంతర అధ్యయనం ద్వారానే నాయకుడిగా ఎదిగి కార్మిక సమస్యలపై స్పష్టమైన అవగాహనతో పనిచేశారని తెలిపారు. ప్రభుత్వ విధానాలను అర్థం చేసుకోకుండా కార్మిక వర్గాన్ని ఉద్యమాల దిశగా నడిపించలేమని తరచూ చెప్పేవారని గుర్తు చేశారు. అధ్యయనమే పోరాటాలకు పునాది అని ఆయన నమ్మకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, ఏజే రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం. జ్యోతి, అన్నవరపు సత్యనారాయణ, నర్సారెడ్డి, బ్రహ్మచారి, కారం పుల్లయ్య, లిక్కి బాలరాజు, రేపాకుల శ్రీనివాస్, సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మంద నరసింహారావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ధర్మనబి, వీర్ల రమేష్, భూక్య రమేష్, కొండబోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.









# టిబి నిర్మూలనపై భద్రాద్రి జిల్లాలో ముమ్మర చర్యలు

- 100 రోజుల టిబి ముక్త భారత్ అభియాన్ పై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం
- 92 హైరిస్క్ గ్రామాల గుర్తింపు.. ఇప్పటికే 45 గ్రామాల్లో సర్వే పూర్తి
- 4,698 మందికి స్క్రీనింగ్, ఎక్స్‌రే పరీక్షలు.. 89 మందికి టిబి నిర్ధారణ
- క్షయవ్యాధి నిర్మూలనకు అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేయాలని జిల్లా అధికారి డాక్టర్ తుకారం రాదోడ్ సూచనలు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 22 ( ప్రజాజ్యోతి )** క్షయవ్యాధి నిర్మూలన లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల టిబి ముక్త భారత్ అభియాన్ కార్యక్రమాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విస్తృతంగా అమలు చేస్తున్నట్లు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారం రాదోడ్ తెలిపారు. ఈ కార్యక్రమంపై శుక్రవారం జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద జూమ్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. మార్చి 24 నుంచి జూలై 5 వరకు కొనసాగనున్న ఈ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా జిల్లాలో టిబి వ్యాధిగ్రస్తులను ముందుగానే గుర్తించి చికిత్స అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు ఆయన వివరించారు. జిల్లాలో క్షయవ్యాధి ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశమున్న 92 హైరిస్క్ గ్రామాలను గుర్తించి ప్రత్యేక సర్వేలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 45 గ్రామాల్లో సర్వే పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఈ సర్వేలో భాగంగా నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరాలకు మొత్తం 7,074 మంది హాజరయ్యారని చెప్పారు. వారిలో 4,698 మందికి టిబి స్క్రీనింగ్‌తో పాటు ఛాతీ ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షల్లో 89 మందిని టిబి వ్యాధిగ్రస్తులుగా గుర్తించి వెంటనే వారికి చికిత్స ప్రారంభించినట్లు డాక్టర్ తుకారం రాదోడ్ తెలిపారు. టిబి లక్షణాలు ఉన్న వారిని త్వరితగతిన గుర్తించి పూర్తి స్థాయి వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నాయని చెప్పారు.

### టిబి నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ

జిల్లాలో టిబి నిర్మూలన కోసం గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు, ఇంటింటి సర్వేలు, ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా పోషకాహార లోపం, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు, బలహీన ఆరోగ్య పరిస్థితులు ఉన్న వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. టిబి లక్షణాలైన దీర్ఘకాలిక దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, అలసట వంటి సమస్యలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. టిబి పూర్తిగా నయం అయ్యే వ్యాధి అని సరైన సమయంలో చికిత్స ప్రారంభిస్తే ప్రమాదాన్ని నివారించవచ్చని తెలిపారు.

### అవగాహన కార్యక్రమాలు మరింత విస్తరించాలి

ఈ సమీక్ష సమావేశంలో పాల్గొన్న మినిస్ట్రీ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్, న్యూఢిల్లీకి చెందిన అడిషనల్ సెక్రటరీ మాట్లాడుతూ జిల్లాలో మిగిలిన గ్రామాల్లో కూడా విస్తృతంగా సర్వేలు నిర్వహించి టిబి వ్యాధిగ్రస్తులను గుర్తించాలని అధికారులకు సూచించారు. క్షయవ్యాధిపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని గ్రామస్థాయిలో ప్రత్యేక ఆరోగ్య శిబిరాల సంఖ్య పెంచాలని సూచనలు చేశారు. టిబి నిర్మూలనలో వైద్య సిబ్బందితో పాటు గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది భాగస్వామ్యం కావాలని సూచించారు.

### అధికారుల సమన్వయంతో కార్యక్రమం విజయవంతం

జిల్లాలో టిబి ముక్త భారత్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు వైద్యశాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. గ్రామస్థాయిలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి ప్రజలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టిబి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ప్రసాద్, క్వాలిటీ మేనేజర్ శృతి, డిపియు సలిత తదితరులు పాల్గొన్నారు.

# మాయమైన మట్టి కుండ...
# మసకబారిన మానవత్వం

**ఒకప్పుడు వేసవి వచ్చిందంటే ఊరూరా చలివేంద్రాలు కనిపించేవి. ఎండలో అలసిపోయిన బాటసారికి మట్టి కుండ నీళ్లు ప్రాణాధారంగా మారేవి. ఇప్పుడు చల్లటి నీళ్లు ఇచ్చే చేతులు తగ్గి... బాటిల్ నీళ్లు అమ్మే దుకాణాలు పెరిగాయి. దాహాన్ని తీర్చిన మానవత్వం మసకబారుతుండటంపై సమాజంలో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పుడు కాలం మారింది. ఎండలు మాత్రం తగ్గలేదు. భానుడు మరింతగా మండిపోతున్నాడు. రోడ్లపై వేడి అలలు ఉప్పొంగుతున్నాయి. కానీ ఒకప్పుడు ఎండలో మనుషులకు ఉపశమనం ఇచ్చిన చలివేంద్రాలు మాత్రం నిశ్శబ్దంగా కనుమరుగవుతున్నాయి. మట్టి కుండలు కనిపించడం తగ్గిపోయింది. చల్లటి నీళ్లు అమ్మే దుకాణాలు పెరిగాయి. దాహాన్ని తీర్చే నీరు కూడా ఇప్పుడు వ్యాపార వస్తువుగా మారిపోయింది. ఈ నేపథ్యంలో కనుమరుగవుతున్న చలివేంద్రాలపై ప్రజా జ్యోతి ప్రత్యేక కథనం.**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి (భూక్యా రంజిత్ నాయక్), ప్రజాజ్యోతి

- కనుమరుగవుతున్న చలివేంద్రాలు
- నాడు దాహానికి ధర్మం పోసిన రోజులు
- నేడు డబ్బు దాహంలో దాగిపోయిన బ్రతుకులు
- •దాహం చూసిన మనసులు పోయి...
- ధర చూసే రోజులు వచ్చాయా..?



వేసవి కాలం రాకముందే ఒకప్పుడు ఊళ్లలో ఓ ప్రత్యేకమైన సందడి కనిపించేది. రోడ్ల కూడళ్లలో, బస్ స్టాండ్‌ల వద్ద, దేవాలయాల సమీపంలో, మార్కెట్ ప్రాంతాల్లో పెద్ద పెద్ద మట్టి కుండలు వరుసగా కనిపించేవి. వాటి మీద తడి గుడ్డ కప్పి, పక్కనే స్టీల్ గ్లాసులు అమర్చి "చలివేంద్రం" అని రాసిన పలక వేలాడుతూ ఉండేది. ఎండలో అలసిపోయి వచ్చిన బాటసారికి అక్కడ లభించే గ్లాసు చల్లటి నీళ్లు అమృతంలా అనిపించేవి. దాహంతో అలమటించే మనిషికి నీళ్లు అందించే ఆ చేతుల్లో ఒక అపూర్వమైన మానవత్వం కనిపించేది. ఒక గ్లాసు నీళ్లు తాగిన తర్వాత "చల్లగా ఉన్నాయి బాబూ" అంటూ ప్రయాణికుడు పలికే మాటల్లో కృతజ్ఞత కనిపించేది. నీళ్లు పోసే చేతుల్లో సేవాభావం కనిపించేది. అప్పట్లో చలివేంద్రం అంటే కేవలం నీళ్లు పెట్టే స్థలం కాదు... మనిషి మనసు ఇంకా చల్లగానే ఉందని చెప్పే నిదర్శనం. "చెట్టు నీడలో కూర్చున్నవాడికే చల్లదనం విలువ తెలుస్తుంది" అన్నట్టుగా ఆ రోజుల ఆప్యాయత ఇప్పటికీ పలువురి జ్ఞాపకాలలో తడిగా మిగిలిపోయింది.

### ››› ఒకప్పుడు సేవ... ఇప్పుడు అవసరమే లేనట్టా..?

ఒకప్పుడు సేవా భావంతో ఎంతో మంది చలివేంద్రాలు ఏర్పాటు చేసేవారు. కొందరు నిజమైన దాతృత్వంతో ముందుకొచ్చేవారు. మరికొందరు పేరు కోసం అయినా ప్రజలకు నీళ్లు అందించేవారు. కారణం ఏదైనా కావచ్చు... చివరకు దాహంతో ఉన్న మనిషికి నీళ్లు అందేవి. ప్రయాణంలో డబ్బులు వెచ్చించి బాటిల్ వాటర్ కొనలేని నిరుపేదలకు, రిక్షా కార్మికులకు, కూలీలకు, బాటసారులకు ఆ చలివేంద్రాలే ఆధారం అయ్యేవి. ఎండలో నడుస్తూ అలసిపోయిన ఓ కూలీ చలివేంద్రం దగ్గర ఆగి రెండు గ్లాసుల నీళ్లు తాగిన తర్వాత ముఖంపై కనిపించే ఉపశమనం... చిన్నపిల్లలు కుండ నీళ్ల కోసం పోటీ పడే దృశ్యాలు... "ఇంకో గ్లాసు తాగు బాబూ" అని ప్రేమగా పలికే పెద్దల మాటలు... ఇప్పుడు కేవలం జ్ఞాపకాలుగా మాత్రమే మిగిలిపోతున్నాయి. "ఉన్నప్పుడు ఊరు కోరు...పోయాక బాధపడతారు" అన్న సామెతను గుర్తు చేసేలా చలివేంద్రాల పరిస్థితి మారిపోయింది.

### ››› మట్టి కుండ చల్లదనం... మనుషుల మనసుల్లోనూ ఉండేది

మట్టి కుండలోని నీళ్లకు ఒక ప్రత్యేకమైన రుచి ఉండేది. ఆ చల్లదనంలో ప్రకృతి హాయితో పాటు మనుషుల మనసుల ఆప్యాయత కూడా కలిసిపోయి ఉండేది. ఒకప్పుడు ఇంటి ముందర మట్టి కుండ ఉంచడం ఆనవాయితీగా ఉండేది. ఇంటికి వచ్చిన అతిథికి ముందుగా ఇచ్చేది కుండ నీళ్లే. ఇప్పుడు ఫ్రిజ్ నీళ్లు వచ్చాయి. మినరల్ వాటర్ బాటిళ్లు వచ్చాయి. కానీ మనుషుల మధ్య చల్లదనం మాత్రం తగ్గిపోయిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. "చెట్టు ఉన్నప్పుడే నీడ విలువ తెలియదు" అన్నట్టుగా మట్టి కుండలు కనుమరుగయ్యాకే వాటి విలువ గుర్తొస్తోందని పెద్దలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "మనసుంటే మార్గం ఉంటుంది" అన్న మాటలా ఇప్పటికీ కొందరు సేవాభావంతో చలివేంద్రాలు నిర్వహిస్తున్నా... గతంతో పోలిస్తే ఆ సంఖ్య చాలా తగ్గిపోయింది.

### ››› నీళ్లు కూడా వ్యాపారమైపోయిన కాలం

ఒకప్పుడు ఎండలో తిరిగే కూలీకి, బాటసారికి చలివేంద్రం కనిపిస్తే అది దేవుడి వరంలా అనిపించేది. ఇప్పుడు ప్రతి మూలలో బాటిల్ వాటర్ దుకాణాలే కనిపిస్తున్నాయి. దాహం తీర్చే నీళ్లు కూడా కొనుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకప్పుడు "దాహార్తికి నీళ్లు ఇస్తే దైవానికి సేవ చేసినట్లే" అని భావించిన సమాజం... ఇప్పుడు నీటినే లాభనష్టాల లెక్కల్లో కొలుస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. "డబ్బున్నవాడిదే దండం" అన్నట్టుగా ఇప్పుడు దాహానికీ ధర కట్టే రోజులు వచ్చాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ››› మారిన జీవనశైలి... మాయమవుతున్న మానవత్వం

చలివేంద్రాలు తగ్గిపోవడానికి అనేక కారణాలు కనిపిస్తున్నాయి. పట్టణీకరణ పెరిగింది. అపార్ట్‌మెంట్ సంస్కృతి విస్తరించింది. సమయాభావం పెరిగింది. పరిచయాలు తగ్గిపోయాయి. "మనకేం?" అనే ఆలోచన పెరిగిన కొద్దీ "మనుషుల కోసం" అనే భావన క్రమంగా కనుమరుగవుతోందని సామాజిక పరిశీలకులు చెబుతున్నారు. మరోవైపు ప్లాస్టిక్ సంస్కృతి పెరగడం, ఫ్రిజ్‌లు అందుబాటులోకి రావడం, బాటిల్ వాటర్ వినియోగం పెరగడం కూడా మట్టి కుండల వినియోగాన్ని తగ్గించాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. "కాలం మారితే అలవాట్లు మారతాయి" అన్నట్టు జీవనశైలి మారినా... మానవత్వం మాత్రం మారకూడదని పెద్దలు చెబుతున్నారు.



### ››› ఎండలు పెరుగుతున్నాయి... కానీ చల్లని చేతులు తగ్గుతున్నాయి

ప్రతి ఏడాది ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. వడగాల్పులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రోడ్లపై తిరిగే కూలీలు, వృద్ధులు, పేదలు, నిరాశ్రయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి సమయంలో చలివేంద్రాల అవసరం మరింత పెరిగింది. కానీ వాస్తవానికి అవి మాత్రం అరుదుగా కనిపిస్తున్నాయి. ఒక్క గ్లాసు చల్లటి నీళ్లు కూడా ఎండలో అలసిపోయిన ఓ మనిషికి ప్రాణాధారంగా మారవచ్చు. కానీ అలాంటి చిన్న సహాయాలకే ఇప్పుడు సమాజం దూరమవుతోందనే భావన కలుగుతోంది. "చుక్క చుక్కగా చేరితేనే సముద్రం" అన్నట్టు చిన్న చిన్న సేవలే సమాజంలో మానవత్వాన్ని నిలబెడతాయని సామాజికవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

### ››› మళ్లీ మేల్కొనాల్సిన సేవా సంస్కృతి

చలివేంద్రం అనేది కేవలం నీళ్లు ఇచ్చే స్థలం కాదు. అది సమాజంలో ఇంకా మానవత్వం బతికే ఉందనే నమ్మకానికి ప్రతీక. ఎండలో అలసిపోయిన అపరిచితుడికి గ్లాసు నీళ్లు అందించే చేతుల్లో స్వార్థం ఉండేది కాదు. ఆ గ్లాసు నీళ్లలో దాగి ఉండేది దయ, కరుణ, సహానుభూతి. ఇప్పటికైనా సమాజం ఒక్కసారి ఆలోచించాల్సిన అవసరం ఉంది. మట్టి కుండలు ఎందుకు కనుమరుగయ్యాయి అన్నది కంటే... మనుషుల మధ్య చల్లదనం ఎందుకు తగ్గిపోయింది అన్న ప్రశ్న మరింత ముఖ్యమైందేమో.



ఒకప్పుడు గ్రామాల్లో చలివేంద్రం పెట్టడం ఓ సేవా కార్యక్రమంగా భావించేవారు. ఇప్పుడు సేవ కంటే సెల్ఫీ సంస్కృతి పెరిగింది. సమాజంలో మానవత్వం తగ్గిపోవడం బాధాకరం.

**– సమత శ్రీనివాస్, చైర్మన్, క్రాంతి విద్యాలయం**



మట్టి కుండ నీళ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఫ్రిజ్ నీళ్లతో పోలిస్తే సహజ చల్లదనం కలిగి ఉంటాయి. మట్టి కుండల వినియోగం తగ్గిపోవడం ఆరోగ్యపరంగానూ మంచిది కాదు.

**– డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, ప్రముఖ పిల్లల వైద్యులు**



చలివేంద్రాలు కనుమరుగవడం అనేది కేవలం ఒక సంప్రదాయం పోవడం కాదు. సమాజంలో పరస్పర ఆప్యాయత తగ్గిపోతోందనే సంకేతం. ఒక గ్లాసు నీళ్లలో కనిపించే మానవత్వం ఇప్పుడు కనిపించడం లేదు.

**– కొప్పుల మురళి, వ్యవస్థాపకులు, మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్**



ఇప్పుడెక్కడ చూసినా నీళ్లు కొనాల్సిందే. చిన్న ప్రయాణానికి కూడా బాటిల్ వాటర్ కోసం డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఒకప్పుడు చలివేంద్రాలు ఎంతో ఉపశమనం ఇచ్చేవి.

**– కాపు సీతామహాలక్ష్మి, మహిళ నాయకురాలు**

## కాలినడకన వెళ్లి మొక్కు తీర్చుకున్న నల్ల సురేష్ రెడ్డి

**పాల్వంచ, మే 22, ప్రజాజ్యోతి:** శ్యామల గోపాలన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఫౌండర్ కమ్ చైర్మన్ నల్ల సురేష్ రెడ్డి ఆధ్యాత్మిక భావనతో కాలినడకన వెళ్లి మొక్కు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా కేశవాపురంలోని పెద్దమ్మ గుడి లో కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి కాలినడకన బయలుదేరి గుడిపాడు గ్రామ సమీపంలోని తాను నిర్మించిన మోక్ష వేంకటేశ్వర స్వామి దేవాలయం కు చేరుకుని స్వామివారిని దర్శించుకుని మొక్కు తీర్చుకున్నారు. భక్తి శ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమంతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో నల్ల సురేష్ రెడ్డితో పాటు రామకృష్ణారెడ్డి, కొడుపుగంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. మార్గమధ్యంలో భక్తులు ఆయనకు స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.



